క్లుప్తంగా

ఎస్సీ హాస్టల్ పరిశీలన



మదనాపురం: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో మంగళవారం రాత్రి సహాయ సాంఘిక సంక్షేమ అధికారి మల్లేశం బస చేశారు. విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. స్టోర్ రూంతో పాటు వంటగది పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. బుధవారం ఉదయం హాస్టల్ ఆవరణలో తిరుగుతూ పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ బెనహర్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రణవి, మీనాక్షి, గీత, శిరీష, మాధవి, శైలజ, స్వరూప ఈనెల 16వ తేదీ నుంచి నిజామాబాద్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని బుధవారం అధికారి సురేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం రమాకాంత్, ఉపాధ్యాయులు అభినందించారు.

రా రైస్ మిల్లర్ల అభ్యున్నతికి కృషి

కొత్తకోట రూరల్: రా రైస్ మిల్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కొత్తకోట వ్యాపార సంఘం నాయకులు, జిల్లా రైస్ మిల్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విశ్వనాథం వెంకటరమణ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొత్తకోట మాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేష్, గద్వాల జిల్లా ప్రధాన కార్యదర్శి నెల్లూరి రామ్మోహన్ ఉన్నారు.

టై, బెల్టులు వితరణ

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రమేష్‌గౌడ్, బాలరాజు, కృష్ణవేణి సంయుక్తంగా పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులను బుధవారం అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం వెంకటస్వామి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం రాముడు, రవి కుమార్, అరుణ, సంధ్యారాణి పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ అధ్యక్షుడు మాసిరెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి మండలంలోని కడుకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి చేతుల మీదుగా బూట్లు, సాక్సులు, టై, బెల్టులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మద్దిలేటి, వరలక్ష్మి, గద్దె భాస్కర్, మాజీ సర్పంచ్‌లు హరిత, బాలకృష్ణ జానకి, అమ్మఆదర్శ కమిటీ అధ్యక్షురాలు ఇందిరమ్మ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చిమన్నగుంటపల్లికి చెందిన విద్యార్థి నాయకులు ఉదయ్‌కిరణ్‌చారి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.25 వేల ఆర్థికసాయం పంపించగా.. బుధవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాణిక్యం, స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.25 వేల నగదును అదించారు. కార్యక్రమంలో రఘువర్ధన్‌రెడ్డి, హేమంత్, మహేశ్వర్‌రెడ్డి, సంపత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌కు సన్మానం

కొత్తకోట: మదనాపురం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పి.ప్రశాంత్, కె.తిరుపతిరెడ్డితో పాటు డైరెక్టర్లను కొత్తకోట రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పట్టణ సమీపంలో గల ఫంక్షన్ హాల్‌లో బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, శివకుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వి.శ్రీనివాస్‌రెడ్డి, రావుల కర్నాకర్ రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కూటీ చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

కొత్తకోట రూరల్: పట్టణంలోని రాఘవేంద్రకాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాస్ చెందిన స్కూటీ మే 7, 2023న రాత్రి ఇంటి ఆవరణలో ఉంచాడు. తెల్లారేసరికి స్కూటీ కనిపించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇటీవల హైదరాబాద్‌లో బైక్ దొంగతనం చేస్తూ పట్టుబడిన హైదరాబాద్‌లోని జైపూర్ కాలనీ, నాగోల్‌కు చెందిన కట్టెల అనూప్‌కుమార్(టింకు)ను పోలీసులు విచారించారు. కొత్తకోటలో బైక్ చోరీ చేసింది కూడా తానేనని ఒప్పుకున్నాడు. దీంతో హైదరాబాద్ పోలీసుల నుంచి కొత్తకోట పోలీసులకు సమాచారం రావడంతో ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి సిబ్బందితో నిందితుడిని హైదరాబాద్ నుంచి కొత్తకోటకు తీసుకొచ్చి బుధవారం ఆత్మకూర్ కోర్టులో హాజరు పర్చారు. విచారించిన జడ్జి శిరీష నిందితుడికి 8 నెలల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ చందర్ బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకటేష్, నక్క రాములు, విభూతి నారాయణ పాల్గొన్నారు.

హిందువులపై దాడులు సరికాదు

సాక్షి, నెట్‌వర్క్: పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా బీజేపీ, ఏబీవీపీ, హిందూవాహిని ఆధ్వర్యంలో బుధవారం బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పురవీధుల గుండా బైక్ ర్యాలీ తీశారు. విద్యాసంస్థలు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసి బంద్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అరికట్టి రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, బచ్చు రాము, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అరుణ్, లింగన్న, అశ్విన్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, అనిల్‌గౌడ్, కొండాపురం రాము, తమ్మలి విజయ్, వెంకట్రాములు, నర్సింహారెడ్డి, ఎల్లన్న, అశోక్, మధుసూదన్, దస్తగిరి, అంజి, ఆంజనేయులు, కురుమూర్తి, సాయివెంకట్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూవాహిని సభ్యులు



జిల్లా కేంద్రంలో..



ఆత్మకూర్‌లో..

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

పెబ్బేరు రూరల్/ఆత్మకూర్: సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. బుధవారం పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆత్మకూర్ మండలం తిప్పడంపల్లి పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణాలు, గ్రామాల్లో రోజు జ్వర సర్వే నిర్వహించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున శానిటేషన్, క్లోరినేషన్‌పై దృష్టి సారించాలని.. వర్షపు నీరు నిల్వకుండా జాగ్రతలు తీసుకోవాలని కోరారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు నిరంతరం వైద్యసేవలు అందించాలన్నారు. తిప్పడంపల్లి పీహెచ్‌సీకి త్వరలోనే పూర్తిస్థాయి సిబ్బంది నియామకం చేపడతామని వివరించారు. పెబ్బేరులో పల్లె దవాఖానా వైద్యుడు డా. చంద్రశేఖర్, పుర కమిషనర్ ఆది శేషు, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, సిబ్బంది రాజేష్‌గౌడ్, విజయలక్ష్మి, మహాలక్ష్మి, కుమారి, తిప్పడంపల్లిలో డా. నందకిషోర్, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాం రెడ్డి, సీహెచ్‌ఓ సురేష్‌కుమార్, ఎంపీహెచ్‌ఈఓ విద్యాసాగర్, ఆరోగ్య పర్యవేక్షకుడు సురేందర్‌గౌడ్, డాటా ఎంట్రీ ఆపరేటర్ సురేష్, ఫార్మసిస్ట్ శ్రీను, వైద్యసిబ్బంది ఉన్నారు.



పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

భూత్పూర్ కాల్వ నుంచి సాగునీరు

అమరచింత: భూత్పూర్ కెనాల్‌తో నియోజకవర్గంలోని నర్వ, అమరచింత, ఆత్మకూర్ మండలాల్లోని చెరువులను సాగునీటితో నింపుతూ పంటపొలాలకు నీటిని అందిస్తున్నామని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. భూత్పూర్ కెనాల్ ఆయా మండలాల్లో 37 కిలో మీటర్ల పొడవున తవ్వారన్నారు. కాల్వల్లో ముళ్లపొదలు, షిల్టు పేరుకుపోవడంతో నీరు ముందుకు వెళ్లట్లేదని తెలిపారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కాల్వపై ప్రత్యేక దృష్టి పెట్టి కాల్వ మరమ్మతు పనులు చేయిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా పట్టణానికి చెందిన మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి తన సొంత ఖర్చుతో అమరచింత పెద్ద చెరువు వరకు పూడిక తీయిస్తున్నారని తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక..

భూత్పూర్ రిజర్వాయర్ నుంచి అమరచింత పెద్ద చెరువు వరకు కాల్వ ద్వారా వస్తున్న సాగునీటిని పరిశీలించేందుకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గురువారం అమరచింతకు వస్తున్నారని కేశం నాగరాజ్ గౌడ్ తెలిపారు. దేశాయి ప్రకాష్‌రెడ్డితో కలిసి చెరువును పరిశీలించడంతో పాటు నీటికి పూజలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, పోసిరి గారి విష్ణు, తౌఫిక్, హన్మంతునాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగరాజ్ గౌడ్

నిలకడగా విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టడంతో దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిలకడగా కొనసాగుతోంది. బుధవారం ఎగువలోని 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలోని 5 యూనిట్ల ద్వారా 200 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఇప్పటి వరకు 112.625 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామని.. ప్రస్తుతం 32 వేల క్యూసెక్కుల నీటిని వినియోగించి ఉత్పత్తి చేపడుతున్నామని వివరించారు.

మూఢ నమ్మకాలతో దాయాదులపై దాడి

పాన్‌గల్: మూఢ నమ్మకాలతో దాయాదులపై కత్తితో దాడిచేసి గాయపర్చిన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మంగళ్లపల్లికి చెందిన జరుపటి నర్సింహ, చెన్నమ్మ దంపతులకు గోపాల్, మహేష్, శేఖర్ కుమారులు కాగా, తల్లి చెన్నమ్మ నాలుగు నెలల క్రితం చనిపోయింది. వీరి పెద్దనాన్న కుమారుడు జరుపటి నరేందర్ ముగ్గురి అన్నదమ్ములతో తరుచూ గొడవ పడుతూ మీ అమ్మ చనిపోయి దెయ్యంగా మారి మాకు పట్టడం వల్లనే మా కుటుంబ సభ్యులకు తరుచూ జ్వరం వస్తుందని గొడవ పడేవాడు. ఇదే క్రమంలో బుధవారం ఇదే విషయంపై ఘర్షణ పడుతూ కత్తితో జరుపటి గోపాల్, జరుపటి మహేష్‌పై దాడి చేసి గాయపర్చాడు. ఈ విషయంపై జరుపటి శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలో 7వ వార్డులోని కొత్తూర్ రోడ్డు సమీపంలో గల దాదాపు 3ఎకరాల ప్రభుత్వ స్థలంలో గత ప్రభుత్వం వివిధ కుల సంఘాల కమ్యూనిటీ భవనాల నిర్మాణం కోసం స్థలాలను కేటాయించింది. ఈనెల 8న స్థానిక బుడగ జంగాల సంఘం నాయకులు తమకు కేటాయించిన స్థలంలో భవన నిర్మాణ పనులు చేపడుతుండగా పట్టణ కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఆ స్థలం తనదని అడ్డుకోవడంతో పాటు డ్రిల్లింగ్ మిషన్ ద్వారా భవన పిల్లర్లను కూలిచ్చేశాడు. అదే రోజు బుడగజంగాల సంఘం సభ్యులు స్థానిక మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత శుక్రవారం సాక్షి దినపత్రికలో 'కుల సంఘం భవన నిర్మాణ పనులు అడ్డగింత' శీర్షికతో వార్త ప్రచురితం కావడంతో కలెక్టర్ ఆదర్శ్ సురభి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి స్పందించారు. వారి ఆదేశానుసారం బుధవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్.సూర్యకుమార్, ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి అక్కడ పర్యటించి వివరాలను సేకరించారు. ప్రభుత్వ స్థలం పూర్తి వివరాలతో కూడిన నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. సాక్షిలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించడంతో కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు, కమిషనర్ సూర్యకుమార్, ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

పెబ్బేరు రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని అందుకు అనుగుణంగా చదవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి కోరారు. బుధవారం చిట్యాల శివారులోని పీజీ కళాశాలలో కొనసాగుతున్న జేఎన్‌టీయూ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల, మర్రికుంటలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంజినీరింగ్ కళాశాలలో తరగతి గదులు, లైబ్రరీ ఇతర సౌకర్యాలను పరిశీలించారు. తరగతి గదుల నిర్మాణాలు, వసతిగృహ నిర్మాణ టెండర్ నిలిచిపోవడానికి గల కారణాలను కళాశాల ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకున్నారు. పూర్తి వివరాలతో నివేదిక అందించాలని.. జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటిస్తున్నారా? భోజనం ఎలా ఉంది? మాంసం, గుడ్లు ఎప్పుడెప్పుడు అందిస్తున్నారని ఆరా తీశారు. వసతులు, భోజనం బాగున్నాయని విద్యార్థులు సమాధానమిచ్చారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థులకు గణితంలో కొన్ని లెక్కలు ఇచ్చి పరిష్కరించాలని కోరారు. ఓ బాలిక సమస్యను పరిష్కరించడంతో అభినందించి నోట్ పుస్తకాలు బహూకరించారు. అనంతరం స్టోర్ రూంలో కూరగాయలు, సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట ప్రిన్సిపల్ డా. ఎస్‌వీఎస్ రాజు, జీసీడీఓ శుభలక్ష్మి, ఎస్‌ఓ రోహిత, బీసీ సంక్షేమ అధికారి సుబ్బారెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.



మర్రికుంట కస్తూర్బాలో కూరగాయలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం

అమరచింత: స్వాతంత్ర్య దినోత్సవ సంబురాలను పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ సూచన మేరకు ఇంటింటికీ త్రివర్ణ పతాకం కార్యక్రమంలో భాగంగా ఇంటిపై ఎగురవేయడానికి ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వ రాజు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు క్యామ భాస్కర్, అనిల్, అర్జున్‌కుమార్, శ్రీనివాస్‌యదవ్ పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి దోహదం

ఖిల్లాఘనపురం: మండలంలోని ముందలి తండా, వసురాం తండాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడంపై మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. గిరిజన నాయకులతో కలిసి ఖిల్లాఘనపురంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మండలంలోని ముందలితండా, వసురాంతండాలను జీపీలుగా ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వం ఆమోదించి గవర్నర్ ఆమోదం కోసం పంపించినట్లు తెలిపారు. ప్రభుత్వం మారడంతో నిలిచిపోయిన ఫైల్‌ను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి గవర్నర్ ఆమోదం పొందేలా కృషి చేశారని హర్షం వ్యక్తం చేశారు. నరేష్, లక్ష్మణ్, రమేష్, భరత్, హన్మంతు, చిరంజీవి, సక్రు, శంకర్, శ్రీను, రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల హర్షం

మండలంలోని వసురాంతండా, ముందలి తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేస్తు ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడంపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంజాయి రమేష్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పుస్తక సేకరణతో విద్యార్థులకు మేలు



వనపర్తిటౌన్: విలువైన పుస్తకాలను సేకరించి, వాటిని అందుబాటులోకి తీసుకురావడం ఉత్తమ అభిరుచి అని డీఈఓ గోవిందరాజులు అన్నారు. ఈ మేరకు సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో పుస్తక సేకరణలో భాగంగా పుస్తకాలను బుధవారం డీఈఓకు అందజేశారు. కార్యక్రమంలో సాహితీ కళావేదిక అధ్యక్షుడు శంకర్‌గౌడ్, ఏఎంఓ మహానంది, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, జయశంకర్, సురేందర్‌రెడ్డి, బైరోజు చంద్రశేఖర్, రాజుగౌడ్, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలికి సన్మానం

ఉక్రెయిన్‌లో వైద్య విద్యను అభ్యసించి వనపర్తి జిల్లా ఆస్పత్రిలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న వైద్యురాలు డాక్టర్ రచనను సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఓంకార్, చంద్రశేఖర్, శ్రీనివాస్, గంధం నాగరాజు, రాజు గౌడ్, బైరోజు చంద్రశేఖర్, సలీం, అస్రా తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు సాగునీరు అందించాలి

పాన్‌గల్: మండలంలోని జమ్మాపూర్, బహుదూర్ గూడెం, పాన్‌గల్, కొత్తపేట, దొండాయిపల్లి, చింతకుంట, మల్లాయిపల్లి ద్వారా ప్రవహించే కేఎల్‌ఐ కాల్వ ద్వారా ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందించకుంటే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ జిల్లా నాయకుడు చంద్రశేఖర్‌నాయక్, భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం రైతులతో కలిసి కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా.. నేటికీ కాల్వ ద్వారా సాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో వరి నారు ముదిరి పోతుందన్నారు. ఇప్పటికైన మంత్రి ప్రత్యేక దృష్టి సారించి సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పుల్లారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తిరుపతయ్య, ఈశ్వరయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పాన్‌గల్ సమీపంలో కాల్వను పరిశీలిస్తున్న ఆయకట్టు రైతులు

పాముకాటుతో మహిళ మృతి!

పాన్‌గల్: పాముకాటుతో మహిళ మృతిచెందిన సంఘటన పాన్‌గల్ మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పాన్‌గల్‌కు చెందిన సమ్రీన్ బేగం (28) ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి పాముకాటుకు గురికాగా.. వెంటనే వైద్య చికిత్స నిమిత్తం భర్త జిల్లా ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. బుధవారం మృతిచెందింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలికి భర్త, 14 నెలల కుమారుడు ఉన్నారు. కాటు వేసిన పామును చంపేశారు. మృతురాలి తండ్రి జైనుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మృతిపై అనుమానం...

మృతురాలి సమ్రీన్ ఇదే గ్రామానికి చెందిన అతహుల్లాతో రెండు సంవత్సరాల కిందట ప్రేమ వివాహం చేసుకుంది. కుమార్తె పాము కాటుతో మృతిచెందిన విషయంలో అనుమానం ఉందని, సమగ్ర విచారణ జరపాలని మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం రిపోర్టు వస్తే గాని మృతిపై అనుమానాలు తొలుగుతాయి.

కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు తగవు

పాన్‌గల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ అన్నారు. బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద, కార్మిక, కర్షకులకు దోచుకుంటూ.. కార్పొరేటు శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. సమావేశంలో కాకం బాలస్వామి, సహదేవ్, రాముడు, కుర్వ హన్మంతు, పరంధాములు, హరీష్, శంకరయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: రాష్ట్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. బుధవారం వనపర్తిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, భరత్, మోష, శ్రీహరి, గోపాలకృష్ణ, రమేష్, రవీందర్, శ్యాంసుందర్, రఘు, కృష్ణవేణి, లక్ష్మమ్మ, ఆంజనేయులు, కృష్ణ, వరుణ్, ఎత్తం మహేష్ తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో మాట్లాడుతున్న నర్సింహ

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

గోపాల్‌పేట: ఇంట్లో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గోపాల్‌పేట మండల కేంద్రంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన వల్లెపు కుర్మయ్య, రాములమ్మకు ముగ్గురు కుమారులు ఉండగా.. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. మూడో కుమారుడు వల్లెపు రవి(35) కూలీ పనులు చేసుకుని బతుకుతున్నాడు. సుమారు పదేండ్ల కిందటగోపాల్‌పేటలోని చిన్నవడ్డెగేరికి చెందిన కళమ్మతో వివాహమైంది. కొంతకాలంగా ఇంట్లో గొడవలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో రవి భార్య కళమ్మ కొంతకాలంగా తల్లిగారి ఇంట్లోనే ఉంటుంది. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మనస్తాపానికి గురైన వల్లెపురవి ఇంట్లోకి వెళ్లి ఉరేసుకున్నాడు. కొంత సమయానికి బయట ఉన్నవారు ఇంట్లోకి వెళ్లిచూడగా.. అప్పటికే మృతిచెంది కనిపించాడు. రవికి తొమిదేళ్ల కుమార్తె ఉంది.

ఆర్థిక సాయం అందజేత..

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి రూ.5 వేలు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీలో ఉన్న శశికాంత్ రూ.4వేలు, కర్రోళ్ల స్వప్నభాస్కర్ రూ.5వేలు పంపించగా.. స్థానిక నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

మోటార్ దొంగల అరెస్టు

అమరచింత: వారం రోజుల నుంచి మస్తీపురంలో వరుస బోరు మోటార్ల దొంగతనాలు జరుగుతుండడంతో పోలీసులు ఐదుగురు అనుమానితులను విచారించి, వారిని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు పంపినట్లు సీఐ శివకుమార్ తెలిపారు. మండలంలోని మస్తీపురంలో వారం రోజుల కిందట కన్నయ్య మోటార్ వైండింగ్ షాపు నుంచి మరమ్మతుల కోసం వచ్చిన రెండు బోరు మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని బాధితుడు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల కిందట అదే గ్రామానికి చెందిన నాగన్న మోటార్ వైండింగ్ షాపు నుంచి రెండు మోటార్లను ఎత్తుకెళ్లినట్లు గుర్తించి ఐదుగురిని అదుపులోకి తీసుకుని చోరీకి గురైన మోటార్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సురేష్‌కుమార్, సిబ్బందిని సీఐ అభినందించారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

ఆత్మకూర్: స్థానిక జాతర మైదానం బాలుర ఉన్నత పాఠశాలలో 1981–82 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు బుధవారం రూ.50 వేలు విలువ చేసే మైక్‌సెట్, ఆంప్లిఫైర్, డిజిటల్ బాక్సులను పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌సింగ్, పాఠశాల ఇన్‌చార్జీ హెచ్‌ఎం కృష్ణ, ఉపాధ్యాయుడు సంతోష్‌కుమార్, అశోక్‌రావు, శివకుమార్, నాగరాజు, రాములుగౌడ్, చాంద్‌పాష, అనంత్‌కుమార్, శ్రీనివాస్, తిరుపతయ్య, కిషోర్‌శర్మ ఉన్నారు.

ఆశాలకు పనిభారం తగ్గించాలి

పెబ్బేరు రూరల్: ఆశాలకు పని భారం తగ్గించాలని, అధికారులకు వేధింపులు ఆపాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని యాదవ భవనంలో బుధవారం ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బుచ్చమ్మ అధ్యక్షతన ఆశావర్కర్ల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు, కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, బొబ్బిలి నిక్సన్, సునీత, భాగ్య, గిరిజ, చిట్టెమ్మ పాల్గొన్నారు.

పాడె మోసిన ఎమ్మెల్యే

కొత్తకోట రూరల్: మండలంలోని రామనంతాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ వడ్డె బాలస్వామి(75) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. కొత్తకోట కాంగ్రెస్ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి బుధవారం కొత్తకోటలో వడ్డె బాలస్వామి మృతదేహంపై పూమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వడ్డె బాలస్వామి పాడెను ఎమ్మెల్యే మోశారు. పి.కృష్ణారెడ్డి, బోయేజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుభాష్, రాములుయాదవ్, లక్ష్మయ్య ఉన్నారు.



పాడె మోస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి